


పూజిత(597)


శోభిక లక్ష్మి(596)


హేమంత్(595)

పడిపోయిన 10





74.79 శాతం ఉత్తీర్ణతతో 22వ స్థానం

గత ఏడాది 84.46 శాతం.. 20వ స్థానం

ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

- పురం విద్యార్థిని శ్రవస్తికి 598
- కదిరి విద్యార్థిని పూజితకు 597
- సత్తా చాటుకున్న ప్రభుత్వ బడులు
- 31 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత
- నాగసముద్రం జడ్పీహెచ్‌ఎస్‌లో ఒకే ఒక్కరు పాస్

కొత్తచెరువు/పరిగి/హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఈ ఏడాది జిల్లా బాగా వెనుకబడిపోయింది. 74.79 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. బాలురకంటే బాలికలు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మొత్తం 21,084 మంది పరీక్షలు రాశారు. వీరిలో 15,768 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 10,901 మందికిగానూ 7,719 మంది, బాలికలలో 10,183 మందికిగానూ 8,049 మంది ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 84.46 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 74.79 శాతానికి పడిపోయింది. గత ఏడాది రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈ ఏడాది మరో రెండు స్థానాలు దిగజారింది. బాలికల ఉత్తీర్ణత శాతం 79.04, బాలుర ఉత్తీర్ణత శాతం 70.81గా నమోదైంది. ఈ ఏడాది పాసైనవారిలో 11,793 మంది ప్రథమ శ్రేణి, 2,643 మంది ద్వితీయ శ్రేణి, 1,332 మంది తృతీయ శ్రేణి సాధించారు.

శ్రవస్తి.. 598

హిందూపురం విద్యార్థిని గాలి శ్రవస్తి జిల్లాలో అత్యధికంగా 598 మార్కులు సాధించింది. దీంతో తల్లిదండ్రులు నరేష్ కుమార్, నాగమణి గృహిణి సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. తమ కూతురును డాక్టరుగా చూడాలన్నదే తమ కల అని, బాగా చదివిస్తామని అన్నారు.

కదిరి విద్యార్థినికి 597

కదిరిలోని వాల్మీకి పాఠశాల విద్యార్థిని పూజిత 597 మార్కులు సాధించారు. శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని శోభిక లక్ష్మి 596 మార్కులు సాధించింది. తండ్రి నరసింహారావు ఏఎస్‌డబ్ల్యు అధికారి కాగా తల్లి నాగరత్న గృహిణి. తమ కూతురును డాక్టర్‌గా చూడాలని అనుకుంటున్నామని వారు తెలిపారు. ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్‌లో విద్యార్థి విష్ణు, పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థి సంద్ర రుత్విక్ రాయల్ 595 మార్కులు సాధించారు. హిందూపురం నారాయణ విద్యార్థి హేమంత్ 595 మార్కులు సాధించాడు.

సెంచరీలు కొట్టారు..



జిల్లాలో 31 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో ఏడు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. తుమ్మలబైలు, ఓబుళరెడ్డిపల్లి, దొరిగిల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలు, హిందూపురం ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్సియల్ పాఠశాల, రొద్దం కేజీబీవీ, బుక్కపట్నం ఎంజేపీ, ధర్మవరం బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వందశాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన మిగిలిన పాఠశాలలు ప్రైవేటు, కార్పొరేటు యాజమాన్యాల పరిధిలోనివి. నాగసముద్రం జడ్పీ ఉన్నతపాఠశాలలో 11 మందికిగాను ఒక్కరు మాత్రమే పాసయ్యారు. ఇక్కడ అతి తక్కువగా 9.09 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించండి: డీఈఓ

పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులు తమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 30వ తేదీలోగా సప్లిమెంటరీ పరీక్ష రుసుము చెల్లించాలని డీఈఓ కిష్టప్ప సూచించారు. అపరాద రుసుముతో మే 1వ తేదీ చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ.125, మూడు కంటే తక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ.110 చెల్లించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల హవా

పదో తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్కుల పంట పండించారు. పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు దూదేకుల అఫ్రిది 595, షేక్ అహమ్మద్ హుస్సేన్ 595, వై.విశ్వకిరణ్ 594, లక్ష్మీనరసింహారెడ్డి 594, కురుబ అశోక్ 593, సుశాంత్ 592, నందకిషోర్ 591, హేమంత్‌కుమార్, చరణ్‌తేజ్ 590 మార్కులు మార్కులు సాధించారు. మొత్తం 85 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 84 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబు, ప్రభుత్వ అధికారులు విద్యార్థులను అభినందించారు. పరిగి మండలంలో 14 ప్రభుత్వ పాఠశాలల్లో 72శాతం ఉత్తీర్ణత నమోదైంది. బుక్కపట్నం జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థి బండ హరీశ్ 594, ధర్మవరం బీఎస్‌ఆర్ మున్సిప ల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గుర్రం మనోజ్ కుమార్ 594, నల్లచెరువు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి షేక్ సాధిక్ 593, ధర్మవరం గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతంక్రిష్ణ 593 మార్కులు సాధించారు.


అఫ్రీది


అహ్మద్ హుస్సేన్ | లక్ష్మీనరసింహారెడ్డి | విశ్వకిరణ్ | అశోక్
సుశాంత్ | నందకిషోర్ | హేమంత్‌కుమార్ | చరణ్ తేజ్

చంద్రబాబు వల్లే అమ్మవారిపల్లికి కీర్తి

కియ సహకారంతో అభివృద్ధి పనులు

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత


ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి, కియ సీఈఓ

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే అమ్మవారిపల్లికి అంతర్జాతీయ కీర్తి దక్కిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. అమ్మవారిపల్లిలో బుధవారం 1.8 లక్షలు లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, మోడల్ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కియ సీఈఓ గ్యాంగులీ, లీగల్ అడ్వైజర్ హ్యాంగ్లియతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. యర్రమంచి, అమ్మవారిపల్లి గ్రామాలను ప్రపంచ పటంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని అన్నారు. దోచుకో దాచుకో నినాదంతో పరిపాలించి రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని విమర్శించారు. గత ఐదేళ్లలో జే ట్యాక్స్‌కు భయపడి పరిశ్రమలు పారిపోయాయన్నారు. ప్రస్తుతం చంద్రబాబుపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు మళ్లీ మన రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. కియ లేకుంటే ఈ ప్రాంతం ఎడారిగా మారేదని అన్నారు. కియ యాజమాన్యం సామాజిక బాధ్యతలో నీటి సమస్య తీర్చడానికి ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించడం హర్షనీయమన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో పర్యావరణం, ఆరోగ్యం, విద్య, నీటి సమస్యపై కియ దృష్టి సారిస్తోందన్నారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి రూ.2కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మండల కన్వీనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం.. నీ విజయం..

- పరీక్షల సమయంలో తండ్రి మృతి
- పుట్టెడు దుఃఖంలోనూ 581 మార్కులు సాధించిన సిరివల్లి


సిరివల్లి

తాడిమర్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తండ్రి మరణించిన పుట్టెడు దుఃఖంలోనూ పది పరీక్షల్లో విద్యార్థిని ప్రతిభ చాటింది. ఏకంగా 581 మార్కులు సాధించింది. మండలంలోని తురకవారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు తమ్మినేని రమేశ్‌నాయుడుకు గతనెల 9వతేదీన పార్నపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరులోని ఆస్పత్రిలో చేరారు. అనంతపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ఆయన కుమార్తె సిరివల్లి అదే సమయంలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. ప్రమాదం జరిగినప్పట్నుంచి విషయం కుమార్తెకు తెలియకుండా బంధువులు దాచారు. నాన్న గురించి అడిగితే ఆరోగ్యం బాగోలేదని చెబుతూ వచ్చారు. చికిత్స పొందుతూ రమేశ్ నాయుడు గతనెల 16న మరణించారు. అప్పటికీ కుమార్తెకు విషయం చెప్పలేదు. మరుసటి రోజు 17వతేదీన అనంతపురంలోని చర్చి స్కూల్‌లో సిరివల్లి తెలుగు పరీక్ష రాసింది. కేంద్రం నుంచి బయటకు రాగానే.. తన తండ్రి ఎందుకు రాలేదని ఆరాతీసింది. విషయం చెప్పక తప్పని పరిస్థితి తలెత్తింది. మరణించాడని బంధువులు తెలపడంతో సిరివల్లి గుండె లవిసేలా ఏడ్చింది. రోదిస్తూనే అంత్యక్రియలకు హాజరైంది. పుట్టెడు దుఃఖంలోనే మిగతా పరీక్షలు రాసింది. ఏకంగా 581 మార్కులు సాధించింది. విద్యార్థిని విజయం స్ఫూర్తిదాయకమని అందరూ అభినందిస్తున్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం: ఎంపీ బీకే



పెనుకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి అమానుషమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి బుధవారం ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిలో 27 మంది పర్యాటకులు మృతిచెందడం మరో 27 మంది గాయపడటం బాధాకరమన్నారు. దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలనీ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఐఆర్‌ఎస్ అధికారి.. మరోసారి మెరుగ్గా..!


తల్లిదండ్రులతో బొళ్లం ఉమా మహేశ్వర్‌రెడ్డి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఐఆర్‌ఎస్ అధికారి బొళ్లం ఉమామహేశ్వర్‌రెడ్డి సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఈనెల 22న విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 220వ ర్యాంకు సాధించారు. 2023లో వెలువడిన సివిల్స్ ఫలితాల్లో ఆయన 270 ర్యాంకు సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం కాన్పూర్‌లో ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శిక్షణ తీసుకుంటున్నారు. ఆయన పదో తరగతి కర్నూలులోని మాంటిస్సోరి, ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య, బీటెక్ ఐఐటీ హైదాబాద్‌లో చదివారు. ప్రస్తుతం సివిల్స్ ఫలితాల్లో 220 ర్యాంకు సాధించినట్లు తండ్రి రిటైర్డ్ అధ్యాపకుడు రాజశేఖర్‌రెడ్డి, తల్లి రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ పద్మావతి తెలిపారు.

నెగ్గిన అవిశ్వాసం

చైర్మన్ పీఠం కోల్పోయిన వైసీపీ

- చైర్‌పర్సన్ సహా 11మంది గైర్హాజరు
- మూడు నెలల్లోపు కొత్త చైర్మన్


ఎన్నికల అధికారి వీవీఎస్ శర్మ


చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

కదిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసాపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం అవిశ్వాసంపై సమావేశం జరిగింది. మొత్తం 36మంది కౌన్సిలర్లు ఉండగా 25 మంది సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ నజీమున్నిసా, వైస్ చైర్మెన్లు అజ్జుకుంట రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. హాజరైన 25మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా చెతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. చైర్‌పర్సన్ నజీమున్నీసాతో పాటు 11మంది సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. ఈ ప్రత్యేక సమావేశానికి ఆర్డీఓ వీవీఎస్ శర్మ ప్రత్యేక ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అవిశ్వాసం నెగ్గిన నాటి నుంచి మూడు నెలలలోపు చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌ల ఎన్నిక పూర్తి అవుతుందని కమిషనర్ తెలిపారు. అవిశ్వాసం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన తరువాత టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చడంతో పాటు స్వీట్లు పంచి పెట్టారు.

ఫలించిన కందికుంట వ్యూహం

తెలుగుదేశం పార్టీకి కౌన్సిల్‌లో ఐదుగురే సభ్యులు ఉన్నారు. అయితే ఒక ఇండిపెండింట్‌తో పాటు మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. దీంతో వారి సంఖ్య 12కు పెరిగింది. నెల ముందు వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారం కోరారు. తమ వార్డులో అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే తమ కౌన్సిలర్ మద్దతు కూడా ఉంటుందని తెలిపారు. అందరు కలిసి ఎమ్మెల్యే అధ్వర్యంలో ఈనెల 2న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన సమావేశం కోసం వినతి పత్రం ఇచ్చారు. ఆ సమయంలోనే ఎమ్మెల్యే మాట్లాడుతూ మెజార్టీ కౌన్సిలర్‌ల అభిప్రాయం ప్రకారం అవిశ్వాసం నెగ్గుతుందని చెప్పారు. అప్పటి నుంచి బుధవారం ఎన్నిక వరకు కౌన్సిలర్‌లను ప్రత్యేక వ్యూహంతో నడిపించారు. వైసీపీ నాయకులు తమ సొంతపార్టీ వారికి ఎన్ని ప్రలోభాలు పెట్టినా, వాటిని తిప్పికొట్టే విధంగా ఎమ్మెల్యే వ్యూహం రచించినట్లు కౌన్సిలర్లు చెబుతున్నారు.

వైసీపీకి గట్టిదెబ్బే

మున్సిపల్ చైర్మన్ పీఠం కోల్పోవడం నియోజకవర్గంలో వైసీపీకి గట్టి దెబ్బేనని పలువురు చెబుతున్నారు. సొంత పార్టీవారే వ్యతిరేకంగా పనిచేయడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది. కౌన్సిలర్లను కాపాడుకోవడానికి నియోజవర్గ ఇన్‌చార్జ్ మక్బూల్ బాషా చేసిన ప్రయత్నాలు ఫలించలేదని వైసీపీ నాయకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరవాత కార్యకర్తలను పట్టించుకునే వారు లేరని, అందువల్లే అనేక మంది పార్టీ వీడుతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలో వైసీపీ నుంచి మరిన్ని వలసలు భారీగా ఉంటాయని పలువురు చెబుతున్నారు.

భారీగా ఆశావహులు

చైర్‌పర్సన్‌ను దింపడం పూర్తి కావడంతో మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం ఆశావహులు భారీగా పోటీ పడుతున్నారు. టీడీపీలో ఉన్న వారు, టీడీపీకి మద్దతు ఇచ్చిన వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా సీనియర్లు తమకు పదవులు దక్కుతాయని ఆశిస్తున్నారు. అయితే కౌన్సిలర్‌లకే ఎన్నిక స్వేచ్ఛను ఇచ్చినట్లు సమాచారం. మూడు నెలల సమయం ఉన్నప్పటికి నెలలోపే ఎన్నిక వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి కోసం కలిసి వచ్చారు: ఎమ్మెల్యే కందికుంట


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

పట్టణ అభివృద్ధి కోసం వైసీపీ కౌన్సిలర్లు కలిసి వచ్చారని, వారందరికి ధన్యవాదాలు చెబుతున్నట్లు ఎమ్మెల్యే కందికుంట తెలిపారు. వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా పట్టణాభివృద్ధిగా కుంటుపడిందని చెప్పారు. పట్టణాభివృద్ధి కోసం అందరు కలిసి కట్టుగా పనిచేస్తామని అన్నారు. పట్టణంలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ ఆస్తులు, అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరించడానికి చైర్‌పర్సన్ మార్పు అనివార్యమైందన్నారు. దోమల నివారణ, రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, కుక్కల బెడద వంటి అనేక సమస్యలు పట్టణంలో ఉన్నాయని చెప్పారు. వాటి పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు.

ఫ్చ్..!

సంక్షేమ హాస్టళ్లలో తగ్గిన ఉత్తీర్ణత..
కొరవడిన పర్యవేక్షణ..
పట్టించుకోని అధికారులు, వార్డెన్లు

(వివరాలు 7వ పేజీలో..)





ఆత్మరక్షణ పేరుతో నిధుల భక్షణ

నీరుగారుతున్న కేంద్ర పథకం
రెండు జిల్లాల్లోనూ నిధులకు ఎసరు
ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు
వైసీపీ హయాంలో రూ.5 కోట్లు హాంఫట్ (6లో..)



ఉత్తుత్తి ఆత్మరక్షణ షో ఇస్తున్న కోచ్‌లు (ఫైల్)

ఆత్మరక్షణ పేరుతో నిధుల భక్షణ



అనంతపురం కలెక్టరేట్‌లో సంతకాల ఫోర్జరీపై చర్చిస్తున్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ నిర్వాహకులు

నీరుగారుతున్న కేంద్ర పథకం

రూ.కోటిపై కన్ను



- రెండు జిల్లాల్లోనూ నిధులకు ఎసరు
- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు
- వైసీపీ హయాంలో రూ.5 కోట్లు హాంఫట్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాలికలపై పెరుగుతున్న దాడుల నుంచి ఆత్మరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రవేశపెట్టిన పథకం నిర్వీర్యమవుతోంది. ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి ఆపదలో తనను తాను రక్షించుకోవడానికి ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'రాణి లక్ష్మీబాయ్ ఆత్మ రక్ష ప్రసిక్షణ్' పేరిట ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఇందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.కోటి నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ఎన్నడూ పేరు కూడా వినని హైదరాబాద్‌కు చెందిన రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీకి అనంతపురం, విజయవాడకు చెందిన రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీకి శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆత్మరక్షణ కళల శిక్షణ బాధ్యతను కట్టబెట్టారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెరో రూ.14లక్షల చొప్పున రూ.28లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. మొదట ఒక్కో జిల్లాలో 167 మంది కోచ్‌లతో శిక్షణ ప్రారంభిస్తామని చెప్పిన ఏజెన్సీ నిర్వాహకులు నైపుణ్యత, అనుభవం లేని స్థానిక కోచ్‌లతో ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో 495 ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది బాలికలకు, శ్రీసత్యసాయి జిల్లాలో 480 పాఠశాలల్లో 45వేల మంది బాలికలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఒప్పందం చేసుకుని మూడునెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సగానికి పైగా స్కూళ్లల్లో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ప్రతి పాఠశాలలో కనీసం 20 క్లాసులు నిర్వహించాల్సి ఉంది. ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించిన స్కూళ్లలో కూడా పది తరగతులు నిర్వహించలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.కోటి చొప్పున రూ.5 కోట్లు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే నిధులను హాంఫట్ చేసేశారు.

ఫోర్జరీ సంతకాలతో హాజరు నమోదు

బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణకు సంబంధించి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు చేయడం వివాదంగా మారింది. అనంతపురం కేంద్రంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆత్మరక్షణ కళల పథకం నడిపిస్తున్నారు. కలెక్టరేట్లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ ప్రతినిధులు ఆయా పాఠశాలలు, ఆయా మండలాల ఎంఈఓల సంతకాలను ఫోర్జరీ చేస్తున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. చాలా పాఠశాలల్లో శిక్షణ ప్రారంభించకనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. మార్చి 3 నుంచి 27వతేదీ వరకు శిక్షణ నిర్వహించాల్సి ఉంది. కోచ్‌లు లేక శిక్షణ ప్రారంభించలేదు. మొత్తానికి విద్యా సంవత్సరం పూర్తయిపోతోంది. శిక్షణ ఇవ్వకుండానే నిధులు కాజేసేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. రూ.కోటి నిధులు బూడిదలో పోసిన పన్నీరుగానే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఒప్పందం ప్రకారం 167మంది కోచ్‌లతో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఎలాంటి నైపుణ్యంలేని 20 మంది స్థానిక ఉత్తుత్తి కోచ్‌లతోనే శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 975 ప్రభుత్వ పాఠశాలలకు గాను 400 స్కూళ్లలో మాత్రమే నామమాత్రంగా ప్రారంభించారు. ఇందులోనూ వంద స్కూళ్లలో పది తరగతులు కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

ఆలస్యమైన మాట వాస్తవమే

కొన్ని అడ్డంకులతో బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణ ఆలస్యమైన మాట వాస్తవమే. బాలికలకు ఉపయోగకరంగా ఉండేలా ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇస్తున్నాం. నిష్ణాతులైన కోచ్‌లు ఇందుకు అవసరమైన శిక్షణ, సాధన చేయిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే నిర్వహించాల్సిన శిక్షణలు ఆలస్యంగా ప్రారంభించాం. ప్రతి పాఠశాలలో కనీసం 20 తరగతులు కచ్చితంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. శిక్షణకు సంబంధించి ఏజెన్సీతో బాండ్‌పైన రాయించుకున్నాం. ప్రతి అంశం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రతి తరగతి, ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిందే.

- శైలజ, దేవరాజ్, ఏపీసీలు, సమగ్రశిక్ష, అనంతపురం, శ్రీసత్యసాయి

ఆత్మరక్షణ కళలతో ఉపయోగం



ఆత్మరక్షణ కళలు బాలికలకు ఎంతో ఉపయోగకరం. మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఆత్మరక్షణ కళలు తమను తాము రక్షించుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పూర్తి స్థాయిలో నైపుణ్యంగల కోచ్‌ల ద్వారా శిక్షణ ఇస్తే ఉపయోగం ఉంటుంది. ఈ పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలి. క్రీడా శాఖ నుంచి మా వంతు సహకారం అందిస్తాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ



మొక్కతొడిగిన మోసం



నర్సరీలో పెంచుతున్న టమోటా మొక్కలు


నాసిరకం మొక్కలు అంటగడుతున్న నర్సరీ నిర్వాహకులు

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహణ
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- సాగు సమయంలో గుర్తించలేక నష్టపోతున్న రైతులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏడంతా ఏడిపించినా ఒక్కసారి పంట తగులుకుంటే చాలు తమ భాగ్యరేఖ మారుతుందని నమ్మి అనేక మంది రైతులు టమోటా పంటను సాగు చేస్తున్నారు. వీరు మొక్కల కోసం నర్సరీలపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా కొందరు నర్సరీల నిర్వాహకులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి అధిక రేట్లు, నాసిరకం మొక్కలు అంటగడుతూ రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 200 పైబడి నర్సరీలు ఉన్నాయి. నర్సరీ నుంచి నాణ్యమైన ఉద్యాన మొక్కలను మాత్రమే రైతులకు అందించాలి. సిఫారసు చేసిన ఉద్యాన పంటల రకాల మొక్కలను మాత్రమే పెంచాలి. మొక్కపేరు, మూలాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పురుగులు, తెగుళ్ల సోకని మొక్కలను రైతులకు సరఫరా చేయాలి. ఐదేళ్లలో జరిగిన మొక్కల అమ్మకాల వివరాలను యాజమాన్యం రికార్డు చేయాలి. మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చారు, వాటి ధరలను బోర్డులపై ఉంచాలి. ప్రభుత్వం నుంచి తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలి. ఇలాంటి నిబంధనలు ఇక్కడ ఏమాత్రం పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని ఉద్యానశాఖ అధికారులు

నాణ్యమైన మొక్కల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2012లో ఉద్యాన పంటల నర్సరీల చట్టాన్ని రూపొందించింది. అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహించరాదని, అలా చేస్తే అధికారులు చర్యలు తీసుకునేలా జీవో నంబర్ 211ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే నియోజకవర్గంలో చాలా చోట్ల అనుమతులు లేకుండానే నర్సరీలను నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు ఏమాత్రమ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. దీంతో నిర్వాహకులు నాసిరకం మొక్కలను రైతులకు అంటగడుతున్నారు. ఈ విషయమై రైతులు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నర్సరీల నుంచి మొక్క తెచ్చినపుడు అసలుకు, నాసిరకానికి ఏమాత్రం తేడా ఉండదు. పైరుగాని, మొక్కగాని ఎదిగే క్రమంలో రైతులు తేడాను గుర్తిస్తారు. అయితే అప్పటికే రైతు పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఉంటారు. దీంతో పంట పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎవరైనా రైతులు గొడవకు దిగితే రాజకీయ పార్టీల నాయకుల అండతో దుప్పటి పంచాయతీ చేస్తున్నారు. అంతో ఇంతో ముట్టుజెప్పి సమస్యను సద్దుమణిగిస్తున్నారు.



కర్ణాటకకు పరుగులు

కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో నాసిరకం టమోటా నారును రైతులకు అంటగడుతున్నారు. విసిగిపోయిన రైతులు నాణ్యమైన టమోటా మొక్కల కోసం కర్ణాటక ప్రాంతా లకు పరుగులు తీస్తున్నారు. చెళ్లికెర, పావగడ ప్రాంతాలకు వెళ్లి ట మోటా, మిరప మొక్కలను ఎక్కువగా తీసుకొస్తున్నారు. అక్కడ మొక్కల్లో నాణ్యతా ప్రమాణాలు బాగుండటంతో చాలా మంది కర్ణాటక బాట పడుతున్నారు.



కుందుర్పి మండలంలో నర్సరీలకు తనిఖీకి వెళ్లి టమోటా మొక్కను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి నరసింహారావు, ఉద్యానశాఖాధికారి గౌసియామీ (ఫైల్)

50 నర్సరీలకే అనుమతి

నియోజకవర్గంలో దాదాపు 50 నర్సరీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అయితే దాదాపు 200 నర్సరీలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీటిలో ఏ నర్సరీలోను నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లా ఉద్యానశాఖాధికారులు కూడా నర్సరీల నిర్వాహణపై తనిఖీలు చేశారే కాని, పూర్తి స్థాయిలో నిబంధనలు అమలు జరిగేటట్లు చూడలేదు. టమోటా సాగు లాభసాటిగా ఉండటంతో రైతులు ఎక్కువ మంది పంట సాగుకు మొగ్గు చూపుతారు. దీన్ని ఆసరాగా చేసుకుని నర్సరీలు పుట్టగొడుగులా వెలిశాయి.

పంట ఎదుగుదల లేదు



నాకున్న మూడెకరాల్లో ఎకరాల్లో టమోటా సాగు చేశా. అయితే ఎన్ని మందులు పిచికారీ చేసినా పంట ఎదుగుదల లేదు. తోటి రైతులు పంటను పరిశీలించి నాసిరకంగా మొక్కలని తేల్చారు. ఈక్రమంలో పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయా. నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

- బొమ్మయ్య, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఐదెకరాల్లో నష్టపోయా



నాకున్న ఐదెకరాల పొలంలో విడతల వారీగా టమోటా సాగు చేశా. మొక్కలు కుందుర్పి మండలంలోని ఓ నర్సరీ నుంచి తెచ్చా. అవి నాసిరకం కావడంతో పంట ఏమాత్రం దిగుబడి రాలేదు. దీం తో పూర్తిగా నష్టపోయా. ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం. **- రామాంజనేయులు, కరిగానిపల్లి**

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు లేని నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. నకిలీ మొక్కలను ఇస్తున్నారని ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- గౌసియామీ, ఉద్యానశాఖాధికారి

అవిశ్వాసానికి సై

మడకశిర చైర్‌పర్సన్‌పై 13మంది తీర్మానం

కలెక్టర్‌కు సమర్పణ



కలెక్టర్‌కు అవిశ్వాసం పెడుతున్నట్లు వినతి సమర్పిస్తున్న కౌన్సిలర్లు

మడకశిర టౌన్/పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సర్వం సిద్ధమైంది. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. బుధవారం 13 మంది ప్రస్తుత చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానానికి సై అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ చేతన్‌ను ఆయన చాంబర్‌లో కలిసి, కౌన్సిలర్లు తీర్మాన పత్రాలు సమర్పించారు. మడకశిర నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. వైసీపీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు.. అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. వీరిలో పలువురు ఇప్పటికే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు కూడా. దీంతో టీడీపీ బలం 13కి చేరింది. ఈ నేపథ్యంలో వారి సంతకాలతో కూడిన పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఐదో వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వవార్డు సభ్యుడు సుధాకర్ నాయక్, 6వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ, 13వ వార్డు సుజాతమ్మ, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వవార్డు సుభద్ర, 18వ వార్డు సావిత్రమ్మ తదితరులు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి తీర్మానాన్ని సమర్పించారు. దీంతో మడకశిర నగర పంచాయతీ పీఠంపై ఎవరు ఆశీనులవుతారన్న చర్చ సాగుతోంది. టీడీపీ తరఫున గెలుపొందిన వారికే అవకాశం ఇవ్వాలనుకుంటే 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు పీఠం ఎక్కడం ఖాయం. నగర పంచాయతీ ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో టీడీపీ తరఫున ఆ వర్గం నుంచి ఆయన మాత్రమే విజయం సాధించారు. దీంతో నరసింహరాజుకు పీఠం ఖరారు అన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో ఇద్దరు ఆ వర్గానికి చెందిన వారు ఉండడంతో వారు పీఠంపై ఆశలు పెట్టుకున్నారని తెలుస్తోంది. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు నరసింహరాజు, ఉమాశంకర్, శ్రీనివాసులు, సుధాకర్ నాయక్, నాగేంద్ర, లక్ష్మయ్య ఉన్నారు.

మెడికల్ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి చెల్లించాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా మెడికల్ వెరిఫికేషన్‌కు వచ్చే టీచర్లు డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆస్పత్రికి రూ.1000 చెల్లించాలని డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. మెడికల్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే టీచర్లు ఈవిషయాన్ని గమనించాలన్నారు. గురువారం అనంతపురం, 25న శ్రీసత్యసాయి జిల్లాల టీచర్లు, ఈ తేదీల్లో గైర్హాజరైన రెండు జిల్లాల టీచర్లు 26వ తేదీన హాజరుకావచ్చునని పేర్కొన్నారు.

మార్పులపై అవగాహన పెంచుకోవాలి: ఆర్టీసీ ఆర్‌ఎం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పేర్కొన్నారు. ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బ్రేక్ సిస్టమ్ మెయింటెనెన్స్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. బ్రేకింగ్ సిస్టమ్‌లో ఆధునిక టెక్నాలజీ అయిన ఏబీఎస్(యాంటి లాక్ బ్రేక్ సిస్టమ్), ఈఎస్‌పీ(ఎలక్ర్టానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్)ల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా..!



కూడేరులో పాఠశాల వరండాలో అంగన్‌వాడీ కేంద్రం

నిధులు లేక నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలు

అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ

ఇబ్బంది పడుతున్న సిబ్బంది, లబ్ధిదారులు

కూడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాడు- నేడు పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు నిధులు లేక నిలిచి పోయాయి. దీంతో కొన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 48 అంగన్‌వాడీ కేంద్రాల్లో 43 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మిగిలినవి అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం గర్భిణులు 254 మంది, బాలింతలు 241మంది, 6 నెలలోపు చిన్నారులు 242మంది, ప్రీ స్కూల్ 2472 మంది ఉన్నారు. గత కొన్నేళ్లుగా 13 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో నాడు- నేడు రెండో దశ కింద ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో ఇప్పేరు, పి. నాగిరెడ్డిపల్లి, మరుట్ల- 2 కాలనీ, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాలకు నూతన భవనాలను మంజూరు చేశారు.

నిధులు సక్రమంగా రాక

వైసీపీ పాలనలో మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను అప్పట్లో ఇంజనీరింగ్ సిబ్బంది పట్టించుకోలేదు. పనుల సమయంలో అందుబాటులో ఉండకపోవడంతో ఆ భారం అంగన్‌వాడీలపైనే పడింది. దీంతో నిధులు సక్రమంగా రాక పోవడం, వచ్చిన అరకొర నిధులతో పనులు చేశారు. తిరిగి నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తర్వాత భవన నిర్మాణ పనులను ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు, తల్లుల కమిటికి అప్పగించారు. ఎన్నికలు రావడంతో నిధులు విడుదల మరింత ఆలస్యమైయింది. దీంతో భవన నిర్మాణం కోసం నిల్వ చేసిన సిమెంట్ కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గడ్డ కట్టి పనికి రాకుండాపోయింది. నిల్వ చేసిన ఇసుక సైతం వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా పనులను పట్టించుకోకపోవడంతో ఆయా పరిధిలో ఉన్న గ్రామీణులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల వరండాలో ...

మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం ప్రస్తుతం పాఠశాల వరండాల్లో కొనసాగుతోంది. సొంత భవనం దెబ్బతినడంతో అద్దె భవనాలు దొరక్క సెంటర్ నడపడానికి అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వరండాలో విధులు కొనసాగిస్తుండటంతో వానాకాలం లో వర్షాలకు వరండాలో ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. సొంత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారని, ప్రభుత్వం తక్షణం భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు.



పి. నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: శ్రీదేవి, సీడీపీఓ



మండలంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటి వరకు ఇప్పేరు, మరుట్ల, పి. నాగిరెడ్డిపల్లి, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాల్లో టాప్ లెవెల్ వరకు నిర్మాణ పనులు జరిగాయి. నిధులు రాక పోవడంతో పనులు నిలిచిపోయాయి. భవనాల పనులు పూర్తి కావడానికి అవసమైన నిధులు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

లారీ ఢీకొని ఫైర్ కానిస్టేబుల్ దుర్మరణం


సుధాకర్ (ఫైల్)

కనగానపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు దాటుతున్న ఫైర్ కానిస్టేబుల్ సుధాకర్ (44)ను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన సుధాకర్ పుట్టపర్తిలో ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండేవారు. విధులు ముగించుకుని పుట్టపర్తి నుంచి అనంతపురం వెళ్లా ముక్తాపురం జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతున్న సుధాకర్‌ను బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న లారీ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందారు. కనగానపల్లి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుధాకర్‌కు భార్య రమ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

గార్లదిన్నె, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం సుగేపల్లి కోనాపురం గ్రామానికి చెందిన యువకుడు దండు కరేగౌడ్ అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు దండు రామచంద్ర కుమారుడు కరేగౌడ్ వ్యవసాయంతో పాటు గ్రామంలో అంగడి వ్యాపారం చేసుకుంటు భార్యా పిల్లలు, తల్లిదండ్రులను పోషించుకునేవాడు. అయితే కరేగౌడ్‌కు కొద్ది రోజుల కిందట అనారోగ్యం బారిన పడ్డాడు. వైద్య పరీక్ష చేయించుకునేందుకు ఈనెల 20న అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తల్లి శివలింగమ్మతో కలిసి వచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం గార్లదిన్నెలో ఉన్న చెల్లెలు రాజేశ్వరికి ఇంటికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెల్లెలు రాజేశ్వరికి చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కరే గౌడ్ కోసం చెల్లెలు రాజేశ్వరి, అమ్మ శివలింగమ్మ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు.

అత్తింటి వేధింపులకు మహిళ బలి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక నగరంలోని బోయగేరికి చెందిన మేదర జ్యోతి(25) ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. మేదర జ్యోతికి సూర్యానగర్‌కు చెందిన ఈశ్వర్‌బాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. జ్యోతిని అదనపు కట్నం కోసం కొన్నేళ్ల నుంచి భర్త, అత్త, మామ వేధిస్తున్నారు. అదనపు కట్నం తేకపోతే విడాకులిచ్చేస్తానని భర్త బెదిరించేవాడు. దీంతో కొంతకాలంగా జ్యోతి పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిపైనున్న గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. జ్యోతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జ్యోతి భర్త ఈశ్వర్‌బాబు, అత్త, మామ, బావ, తోడి కోడలుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఓవీఆర్ కాలనీకి చెందిన ప్రతాప్(34) అనే ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రతాప్.. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఒత్తిడి తాళలేక బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన ఇంటి పైకప్పు

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


నారాయణమ్మ (ఫైల్)

గాండ్లపెంట, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో బుధవారం ఇంటి పైకప్పు కూలి ఓ వృద్ధురాలు మృతిచెందగా, మరో వృద్ధురాలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు మధ్యాహ్నం ఉక్కపోత తట్టుకోలేక ఇద్దరు వృద్ధులు ఓ ఇంటి ఆవరణ ముందు కూర్చొని కబుర్లు చెబుకుంటున్నారు. ఉన్నఫలంగా ఇంటి ఆవరణ పైకప్పు కూలింది. ఈప్రమాదంలో నారాయణమ్మ (65) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరో వృద్ధురాలు వసుంధరమ్మ తలకు బలమైన గాయం కావడంతో 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైనే చికిత్సకోసం అనంతపురం తరలించినట్లు చెప్పారు.

చర్చలు విఫలం..

సమ్మె కొనసాగిస్తాం.. ఓబులు..

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలపై బుధవారం నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో కార్మికుల సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె బుధవారం 18వ రోజుకు చేరింది. యూనియన్ నాయకులతో అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలకు సంబంధించి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నాయకులు తెలిపారు. చర్చల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలల నుంచి 10 నెలల వరకు వేతన బకాయిలు చెల్లించాలి. 30 నెలల నుంచి 40 నెలల వరకు పెండింగ్ ఉన్న పీఎఫ్ బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అధికారులు చర్చలు జరిపారు. కాంట్రాక్టర్ బకాయిలు చెల్లించడానికి మే 15 వరకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు యూనియన్ నాయకులు అంగీకరించలేదు. క లెక్టర్ చర్చలు జరిపి స్పష్టత ఇస్తేనే సమ్మె విరమిస్తామన్నారు. సమావేశంలో ఈఈ మురళీధర్‌రావు, డీఈ శిరీష, ఏఈ మద్దయ్య, శ్రీనివాసులు, యూనియన్ నాయకులు జిల్లా కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 21వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో తగ్గిన ఉత్తీర్ణత

కొరవడిన పర్యవేక్షణ... పట్టించుకోని అధికారులు, వార్డెన్లు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతిలో ఉత్తీర్ణత గతేడాదితో పోలిస్తే తగ్గిపోయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో పదో తరగతి ఫలితాలు 64 శాతానికి పరిమితమయ్యాయి. 90 శాతం... 100కి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తామన్న సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు, అధికారుల మాటలు ఒట్టి మాటలేనని నిరూపితమయ్యాయి. ఎటుచూసినా వసతిగృహాల్లో స్టడీ అవర్స్ తదితర అంశాల్లో పర్యవేక్షణ కొట్టొచ్చినట్లు ఫలితాలతో స్పష్టమవుతోంది. బీసీ సంక్షేమ శాఖలో గతేడాది 80.00 శాతం ఉత్తీర్ణత సాధిస్తే... ఈ ఏడాది 64.93 శాతానికి పరిమితమైంది. ఎస్సీ సంక్షేమ శాఖలో గతేడాది 89.44 శాతం ఉత్తీర్ణత సాధిస్తే... ఈసారి 61.68 శాతానికే పరిమితమైంది. గిరిజన సంక్షేమశాఖలో గతేడాది 80.16 శాతం ఉత్తీర్ణత వస్తే.. ఈ ఏడాది దారుణంగా 41.07 శాతానికి పరిమితవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ సంక్షేమశాఖ వసతిగృహాల్లో..

జిల్లాలో బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతి గృహాల్లో మూడు డివిజన్లలో కలిపి 616 మంది విద్యార్థినీవిద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 400 మంది పాసయ్యారు. 216 మంది ఫెయిలయ్యారు. వీరిలో 224 మంది ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో పదో తరగతి పరీక్షల్లో 64.93 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే గతేడాది 80.00 శాతం ఉతీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 15.07 శాతం తగ్గడం గమనార్హం. కళ్యాణదుర్గం బాలికల వసతిగృహంలో ముగ్గురు విద్యార్థినులు పరీక్షలు రాస్తే... అందరూ ఫెయిలయ్యారు. డి. హిరేహాళ్ బాలుర వసతిగృహంలో ఆరుగురు పరీక్షలు రాస్తే... అందరూ ఫెయిలయ్యారు.

ఎస్సీ సంక్షేమంలో..

ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాలకు సంబంధించి గుత్తి డివిజన్ పరిధిలో 74 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా... 60 మంది పాసయ్యారు. 14 మంది ఫెయిలయ్యారు. 81.08 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనంతపురం డివిజన్ పరిధిలో 63 మంది పరీక్షలు రాయగా... 47 మంది పాసవగా... 16 మంది ఫెయిలయ్యారు. 74.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తాడిపత్రి డివిజన్ పరిధిలోని ఎస్సీ వసతిగృహాల్లో 62 మంది విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలు రాయగా... 42 మంది పాసవగా.. 20 మంది ఫెయిలయ్యారు. 67.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 57 మంది పాసయ్యారు. 61 మంది ఫెయిలయ్యారు. 48.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉరవకొండ డివిజన్‌లో 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 29 మంది పాసవగా... 35 మంది ఫెయిలయ్యారు. అత్యల్పంగా 45.31 ఉత్తీర్ణత శాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి పదో తరగతి పరీక్షల్లో 61.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 89.44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ లెక్కన ఉత్తీర్ణత 27.76 శాతం తగ్గడం గమనార్హం.

గిరిజన సంక్షేమంలో..

జిల్లాలో మూడు గిరిజన సంక్షేమ వసతిగృహాలున్నాయి. చియ్యేడులోని హాస్టల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... ముగ్గురు మాత్రమే పాసయ్యారు. మిగిలిన ఆరుగురు ఫెయిలయ్యారు. అనంతపురంలోని గిరిజన బాలుర వసతిగృహం విద్యార్థులు 10 మంది పరీక్షలు రాయగా... సగం మంది పాసయ్యారు. గుత్తిలోని ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల వసతిగృహంలో 53 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా... 22 మంది పాసవగా... 31 మంది ఫెయిలయ్యారు. జిల్లావ్యాప్తంగా గిరిజన వసతిగృహాలకు సంబంధించి 41.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 80.16 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. మొత్తంగా గతేడాది వచ్చిన ఉత్తీర్ణత శాతంలో ఈ ఏడాది 39.0 శాతం తగ్గిపోయింది.

అత్యధిక మార్కులు సాధించిన వారు..

బీసీ సంక్షేమశాఖకు సంబంధించి నార్పల బీసీ బాలికల వసతిగృహంలోని ఎన్. గంగోత్రి అనే విద్యార్థిని 566, ఆత్మకూరు బీసీ బాలుర వసతిగృహంలోని వై. బాబా ఫక్రుద్దీన్ 559, డి. శఫీర్ 554, జూటూరు బీసీ బాలుర వసతిగృహానికి చెందిన పి. మోక్షిత్‌రెడ్డి 556, అనంతపురంలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎస్. లక్ష్మి 552 మార్కులు సాధించారు. ఎస్సీ సంక్షేమశాఖకు సంబంధించి శెట్టూరు బాలుర వసతిగృహంలోని కె. భరత్ 562, టీకే జశ్వంత్ 553, యాడికిలోని ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థిని భాగ్యలక్ష్మి 550, ఉరవకొండ ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన తేజశ్విని 543, కళ్యాణదుర్గంలోని ఎస్సీ బాలికల నంబర్ వన్ హాస్టల్ విద్యార్థిని నవిత 532, యాడికిలోని బాలికల వసతిగృహం విద్యార్థిని లక్ష్మీప్రసన్న 532, గుంతకల్లులోని నం-1 బాలికల వసతిగృహానికి చెందిన సుచిత్ర 512 మార్కులు సాధించారు. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి గుత్తిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహంలో చార్మిప్రియ 562, యమున 500 మార్కులు సాధించారు.

సోషల్ మీడియాలో పోస్టు.. యువకుడిపై కేసు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రెచ్చగొట్టే రీతిలో సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. చెన్నేకొత్తపల్లికి చెందిన బైరాపురం నాగరాజు ఇంటి వద్ద అడ్డుగా పక్కింటివారు గోడలు నిర్మించారు. కేసు కోర్టుకు వెళ్లడంతో తీర్పు నాగరాజుకు అనుకూలంగా వచ్చింది. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు రెవెన్యూ, పంచాయతీ అధికారులు అక్కడికి వెళ్లి అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించారు. ఈ నేపథ్యంలో గాలి సిద్ధార్థరెడ్డి అనే యువకుడు వైసీపీ సాను భూతిపరులకు చెందిన బాతురూం, ఇంటిపిల్లర్లను టీడీపీ బృందాలు కూల్చివేశాయంటూ సోషల్ మీడియా, వైసీపీ వాట్సాప్ గ్రూపుల్లో రెండు రోజుల కిందట రెచ్చగొట్టే రీతిలో పోస్టు చేశాడు. దీంతో బైరాపురం సరస్వతి అనే మహిళ ఆ పోస్టు తమ కుటుంబానికి ఇబ్బంది కరంగా ఉందని, టీడీపీ వారిని రెచ్చగొట్టేలా ఉందంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే తన కుటుంబానికి ఏ పార్టీతో సంబంధంలేదని, అయితే సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు టీడీపీ వారిని తమపైకి ఉసిగొల్పేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు సిద్ధార్థరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైనార్టీ టాప్.. జడ్పీ ఫ్లాప్

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో భిన్నమైన ఫలితాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలలు 91.03 శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలిచాయి. జడ్పీ హైస్కూళ్లు 49.39 శాతం ఉత్తీర్ణతతో చివరలో నిలిచాయి. జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 10,653 మంది పరీక్షలు రాశారు. వీరిలో 5,261 మంది మాత్రమే పాసయ్యారు.

37 పాఠశాలల్లో 100 శాతం

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్లలో 11,807 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 10,856 మంది పాసయ్యారు. వీరిలో బాలురు 6,162 మంది, బాలికలు 4,694 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

యాజమాన్యాల వారీగా ఫలితాలు

పాఠశాల యాజమాన్యం	పరీక్ష రాసిన వారు	పాసైన వారు	శాతం
మైనార్టీ వెల్ఫేర్	234	213	91.03
బీసీ వెల్ఫేర్	365	314	86.03
సోషల్ వెల్ఫేర్	657	562	85.54
ఎయిడెడ్	406	309	76.11
మోడల్	1,261	923	73.20
కేజీబీవీలు	1,218	884	72.58
ట్రైబల్ వెల్ఫేర్	199	126	63.32
మున్సిపల్	2,083	1,145	54.97
గవర్నమెంట్	1,817	917	50.47
జిల్లా పరిషత్	10,653	5,261	49.39

ఆర్ఓఆర్ ఫైళ్లకు మోక్షం

ఆర్డీఓ కార్యాలయానికి బదలాయింపు
వైసీపీ హయాంలో డీఆర్వో పరిధిలోకి..
ఇబ్బందులు పడ్డ రైతులు... 600 ఫైళ్లు పెండింగ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ప్రజలకు తలనొప్పిగా మారిన ఆర్ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) ఫైళ్లు ఎట్టకేలకు ఆర్డీఓ కార్యాలయ పరిధిలోకి వచ్చాయి. వైసీపీ హయాంలో ఇందుకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ డీఆర్వో పరిధికి కేటాయించారు. ఎప్పటి నుంచో అమలవుతున్న ఈ విధానానికి బ్రేక్ వేసి 2023లో కొత్తగా డీఆర్వో కార్యాలయానికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. అప్పట్లో పనిచేసిన ఓ డీఆర్వో వాటి గురించే పట్టించుకోలేదని సమాచారం. ఎంతో మంది రైతులు, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయడానికే సరిపోయింది. ఆర్డీఓ కార్యాలయానికే వెళ్లలేని కొందరు డీఆర్వో కార్యాలయమంటే ఆ స్థాయి అధికారిని కలవడానికి వెనుకగుడుగేసేవారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నెలలకే ఆర్ఓఆర్ ఫైళ్లు ఆర్డీఓ కార్యాలయానికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఈ విధానం అమలు కావడానికి కొంత ఆలస్యమైంది.

ఏయే సమస్యలుంటాయంటే...

రెవెన్యూ శాఖలో ఆర్ఓఆర్ అనేది హక్కుల రికార్డుగా పిలవబడే ఒక చట్టపరమైన పత్రం. ఒక భూమికి సంబంధించి యాజమాన్యం, పరిధి, భారాలు, సాగు, ఆస్తి పన్ను సహా సంబంధిత సమాచారం ఉంటుంది. పూర్వీకుల భూమా..? మరేదైనా భూమి యజమానా..? అనేది స్పష్టత ఇవ్వడానికి, తనిఖీ చేయడానికి ఆర్ఓఆర్ ఉపయోగపడుతుంది.

ఆర్డీఓ కోర్టు భూమి రికార్డులు, ఇతర రెవెన్యూ సంబంధిత కేసులను పరిష్కరించడానికి ఉపయోగిస్తారు. ఆర్డీఓ కోర్టులో వివాదాలుంటే విచారించి పరిష్కరించాల్సి ఉంటుంది. భూమి ఒకరి పేరు మీద ఉందనీ, ఒకరు, తాము సాగులో ఉంటే మరొకరి పేరు మీద భూమి ఉందని సంబంధిత వ్యక్తులు అధికారులను ఆశ్రయిస్తారు. మిగులు భూములను తమ పేరు మీద ఎక్కించుకోడానికి పరిష్కారం చేయాలని కోరుతారు. వివాదంలో ఉన్న అంశాలకు సంబంధించి ఎవరైనా భూమిని ఆక్రమించుకోవడం, మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కడం లాంటి సమస్యలతో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్తుంటారు. భూములకు సంబంధించి ఇలాంటి వివాదాలపై ఆర్డీఓ కార్యాలయానికి ఫైళ్లు వెళ్తుంటాయి.

600 ఫైళ్లు పెండింగ్...

ప్రభుత్వ నిర్ణయంతో ఎట్టకేలకు ఆర్ఓఆర్ ఫైళ్ల వ్యవహారం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. రెండురోజుల క్రితం అనంతపురం డివిజన్‌కు సంబంధించిన ఫైళ్లను డీఆర్వో కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఇప్పుడిప్పుడే సంబంధిత ఫైళ్లను పరిశీలిస్తున్నారట. డివిజన్ పరిధిలో మొత్తం 600 ఫైళ్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు కార్యాలయ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. డివిజన్ పరిధిలో 14 మండలాల నుంచి వచ్చిన ఫైళ్లు ఉండటం, రెండేళ్లుగా వాటిని పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మరి అధికారులు ఎన్ని రోజుల్లో వాటిని పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జగదీష్ మాట్లాడుతూ.. భారతదేశంలో మత సామరస్యాన్ని దెబ్బ కొట్టలనీ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపాలని ఉగ్రవాదులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సహించరాదన్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొందనీ, ప్రత్యేక రాష్ట్రం ప్రకటించడానికి అన్ని సమస్యలు పరిష్కారమై సమయంలో ఉగ్రవాదులు.. పర్యాటకులపై కాల్పులు జరిపి 30 మందిని పొట్టనపెట్టుకోవడం బాధాకరమన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశంలో పర్యటిస్తున్న సమయంలో ఇలాంటి దాడులు చేసి, కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయాలన్న కుట్రలో భాగమే ఉగ్రదాడిగా ఆయన అభివర్ణించారు. ఇలాంటి ఘటనలను ప్రపంచం మొత్తం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపి, సహాయకార్యదర్శి ఎస్ మహమ్మద్ గౌస్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

జనసేన నివాళి

పహల్గాంలో ఉగ్రదాడి మృతులకు జనసేన పార్టీ స్థానిక కార్యాలయంలో నివాళులర్పించారు. జనసేన పతాకాన్ని అవనతం చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసిగిరి మణికంఠ మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి దుశ్చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బండి శేఖర్ పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని ఖండించిన రఘువీరా

మడకశిర, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ, కశ్మీర్ ప్రాంతంలోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని మాజీమంత్రి రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. సరిహద్దులో ఇటువంటి ఉగ్రవాద చర్యలు అమానుషమైనవి, ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి దాడులను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సత్యసాయి ఆరాధనోత్సవాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి ఆరాధనోత్సవాలు గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం సాయికుల్వంతులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు వస్త్రదానం, నారాయణసేవను అందించడానికి హిల్‌వ్యూ స్టేడియంలో షామియానా లు ఏర్పాటు చేశారు. దాదాపు 30వేల మంది భక్తులు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం సాయికుల్వంతులో సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. సత్యసాయి సేవల గురించి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే ప్రసంగిస్తారు. ఆరాధనోత్సవాలలో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. వేడుకల్లో పాల్గొనే భక్తులకోసం అవసరమైన ఏర్పాట్లలో సేవాదళ్ సభ్యులు నిమగ్నమయ్యారు.

సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వాదం

గుంతకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సాధారణ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో ప్రభుత్వం వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. కమిషనరు నయీం అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కూడా పూర్తి కాలేదంటూ వివరణ ఇవ్వబోగా, అధికారివై ఉండి తగిన సమాధానం చెప్పకుండా ప్రభుత్వంవైపు మాట్లాడుతావా..? అంటూ వారు ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు పవన్ గౌడు, కృపాకర్, యూ ప్రభాకర్, వై సుధాకర్, అనూరాధ, విద్యారాణి కలగజేసుకుని వైసీపీ హయాంలో ఏమాత్రం అభివృద్ధి చేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. పట్టణాభివృద్ధిపై చైర్‌పర్సన్‌ను నిలదీయండి అంటూ ఘాటుగా జవాబిచ్చారు.

మొక్కజొన్న పంట దగ్ధం


పంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేకుంటలో బుధవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ పేలి రైతు చంద్రకు చెందిన మూడు ఎకరాల్లోని మొక్కజొన్న పంట దగ్ధమైంది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని, మరో రెండు రోజుల్లో కోత మొదలుపెట్టేవారమని, అంతలోనే ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు వ్యాపించి పంట దగ్ధమైందని, దీంతో పాటు డ్రిప్ పరికరాలు కూడ కాలిపోయాయని బాధిత రైతు వాపోయారు. రూ. రెండు లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో బుధవారం దాడులు నిర్వహించామని, అక్కడ జయపాల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి కర్ణాటకకు చెందిన 22 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. తర్వాత అరెస్టయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడులలో ఎస్ఐలు పవన్, దామోదర్ పాల్గొన్నారు.

పేలుడుతో మహిళా కూలీకి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పేచర్ల గ్రామ సమీపంలో గల ఒక పొలంలో పేలుడు పదార్థం పేలడంతో కూలిపనులు చేస్తున్న సాలమ్మ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రైతు వేరుశనగ పంటను అడవిపందులు బారి నుంచి కాపాడుకొనేందుకు గాను తన పొలంలో డిటోనేటర్లు ఏర్పాటు చేశాడు. అయితే మహిళా కూలీ ఆ పొలంలో పని చేస్తూ దానిని రాయితో కొట్టింది. దీంతో అది పేలడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

10మంది బైండోవర్

తాడిపత్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి, గన్నెవారిపల్లికాలనీల్లో రౌడీషీటర్లకు బుధవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు సృష్టించకుండా మంచి మార్గాన నడవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలి ఎదుట వారిని హాజరు పరిచి బైండోవర్ చేశారు.

'డిపాజిట్లు చెల్లించేందుకు చర్యలు'

ఉరవకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ టౌన్ బ్యాంకులో డిపాజిట్‌దారులకు డిపాజిట్ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సహకర అధికారి అరుణ కుమారి పేర్కొన్నారు. టౌన్‌బ్యాంకులో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టౌన్‌బ్యాంకులో రూ.5.92కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రూ.4.20కోట్లను డీఐసీజీసీ వారు 1120మందికి చెల్లించేందుకు అనుమతులిచ్చారన్నారు. ఎఫ్‌డీ బాండ్ ఒరిజనల్, డిపాజిట్ బుక్, ఆధార్, పాన్‌కార్డులు వేరే బ్యాంకులో అకౌంట్ ఉంటే ఖాతా నెంబర్‌తో పాటు ఐఎఫ్‌సీ కోడ్ వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో సీఈవో వేదమూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామంలోని ఇంటిలో బుధవారం ఎవరూ లేని సమయంలో ఆయన ఈ అఘత్యానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

తాడిపత్రి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామానికి చెందిన రామలక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 3,25,899 రూపాయలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి లబ్ధిదారురాలి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. మండల టీడీపీ నాయకులు దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్ విజ్జి, ఖాదర్ ఉన్నారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని ఐఓసీ డిపోలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐఓసీ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు సుమారు 50 మంది దాకా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలోఐఓసీఎల్ న్యూడిపో సీనియర్ మేనేజర్ హరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాసమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటసాయి ఐటీఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రజల నుంచి 238 వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వీడాలని అధికారులకు సూచించారు. మామిళ్లకుంట్లపల్లి నుంచి ఓడీచెరువు వరకు ఉన్న దారిని వెడల్పు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని బీజేపీ మండల కన్వీనర్ వీరాంజనేయులు, అమడగూరు, నల్లమాడ, ఓడీసీ మండలాలకు కలిపి ఓడీసీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, గ్రామ కార్యదర్శి సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులకు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వడ్డీతోనే రుణాలు రెన్యువల్ చేయాలి

తనకల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాలను కేవలం వడ్డీ కట్టించుకొని రెన్యువల్ చేయాలని రైతులు, రైతు సంఘం, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రైతులు కరువుతో, పంటలు పండక ఇబ్బందులు పడుతుంటే బ్యాంక్ అధికారులు పంటరుణాల రెన్యువల్ విషయంలో వడ్డీ, అసలు కట్టాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. అనంతరం వినతిపత్రాన్ని మేనేజర్ నాయక్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రమణ, వెంకట రమణ, శివన్న, సీపీఐ రెడ్డెప్ప, కాంగ్రెస్ పారేసు, సీపీఎం రమణ, శివన్న, రైతులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సత్తా

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్‌క్రిష్ణ (593), బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పూల జ్ఞాపిక (586), దాసరి అక్షయ (585), పరిశే లక్ష్మీ (582), దాసరీ కీర్తన (582), కె.వైష్ణసహస్ర (575), పి.మధుమిత (575), బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్‌కుమార్ (594), ఉక్కిసిల ఓబులేశు (590) మార్కులు సాధించారు.



గౌతంక్రిష్ణ పూలజ్ఞాపిక దాసరి అక్షయ

● పుట్టపర్తి రూరల్ : నిడిమామిడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి దేవిరెడ్డిగారి సాహితి 582, ఎనుమలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని చెరువు భవ్యశ్రీ 579, పెడపల్లి జడ్పీ హెచ్ఎస్ పాఠశాల సునందనాయక్ 570, జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ప్రభుచరణ్ 560, సీపీ ధనుశ్రీ 550, చైతన్య వదన్ 534, పెడపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సునంద నాయ క్ 570, పవన్‌కుమార్‌రెడ్డి548, లతీఫా529 మార్కులు సాధించారు.



1. సాహితి
2.చెరువు భవ్యశ్రీ
3.సునంద్‌నాయక్
4.ప్రభుచరణ్
5.పవన్‌కుమార్‌రెడ్డి
6. చైతన్యవదన్

● బత్తలపల్లి : స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అజయ్‌కుమార్ 590, బాలికల పాఠశాల విద్యార్థిని మదిహ 574, బాలుర పాఠశాల విద్యార్థి గణేష్ 565 మార్కులు సాధించారు.

అజయ్‌కుమార్ →



● బుక్కపట్నం : స్థానిక ప్రభుత్వం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి బండా హరీష్ 594 మార్కులు, సిద్దరా మపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి లోకేష్ కుమార్‌రెడ్డి 591, పాముదుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థిని లిఖిత 579 మార్కులు సాధించారు.



హరీష్ లోకేష్



భువనేశ్వర్

● తనకల్లు : కేజీబీవీ పాఠశాలల విద్యార్థి ఉస్తిలిపల్లికి చెందిన భువనేశ్వర్ 520, గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి తేజశ్వనీ 507, ప్రభుత్వం పాఠశాల విద్యార్థి విష్ణువర్ధన్ 490 మార్కులు సాధించారు.

● ముదిగుబ్బ : స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ 589, నరసింహదేవ 585 మార్కులు సాధించారు.



హర్షవర్ధన్ నరసింహదేవ



జగన్మోహన్ పాండురంగనాయుడు

● నంబులపూలకుంట : గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జగన్మోహన్ నాయుడు 543, పాండురంగనాయుడు 530 మార్కులు సాధించారు.

● కదిరిఅర్బన్ : ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి వరుణ్ ఆదిత్య 587, బాలికల పాఠశాల విద్యార్థి బ్రాహ్మిణి 586 మార్కులు, స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ పాఠశాల విద్యార్థి భరత్ యాదవ్ 583 మార్కులు సాధించారు.



వరుణ్ ఆదిత్య బ్రాహ్మిణి భరత్‌యాదవ్

● ఓబుళదే వరచెరువు : గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్‌కుమార్ 586, ఓడీసీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దాదాపీర్ 579, ఆజీత్ కుమార్ 570, కేజీబీవీ విద్యార్థి హారిక 562 మార్కులు సాధించారు.



గౌతమ్‌కుమార్ దాదాపీర్

● నల్లమాడ : అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి పి.మధులత 580, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి వెంకటేష్‌నాయక్ 564, దొన్నికోట పాఠశాల విద్యార్థి మహిత్యశ్రీ 559, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మౌనిక 549, కేజీబీవి విద్యార్థి కావ్య 529, సి బండ వాండ్లపల్లి పాఠశాల విద్యార్థి యాస్మీన్ 501 మార్కులు సాధించారు.



మధులత వెంకటేష్‌నాయక్

● తాడిమర్రి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశ్వ తేజ (544), దాసరి దుర్గేశ్వరి (539), కేజీబీవీ విద్యార్థి శరణ్య(534) మార్కులు సాధించారు.



విశ్వతేజ దుర్గేశ్వరి శరణ్య

● గాండ్లపెంట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గంగాదేవి 570, సాయితేజ 560, ఎస్. షిఫిఖాన్ 559, రుచిత 559, కటారుపల్లి విద్యార్థులు కావ్యశ్రీ 553, ప్రశాంత్ రెడ్డి 522, వసుధ 517, రెక్కమాను విద్యార్థి తేజ్‌కుమారి 536, తుమ్మలబైలు విద్యార్థులు షబ్బానా 508, ఇర్షాన్ 505, కేజీబీవీ విద్యార్థులు తేజశ్రీ 574, వరుణిక 573, గీత 570 మార్కులు సాధించారు.



గంగాదేవి

ఉగ్రవాదుల దాడికి నిరసన



ధర్మవరం: కొవ్వొత్తులతో జనసేన నాయకుల నిరసన

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో సోమవారం పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్ పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అగ్రికల్చర్ రీసర్చ్ కో-కన్వీనర్ సోమల ప్రకాష్, బీజేపీ నాయకులు మాలపాటి రామకృష్ణ, పసుపులేటి వెంకటేష్, నారాయణ కోరారు.

● బుక్కపట్నం: జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పత్తిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు కొవ్వొత్తులతో స్థానికంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందులో జనసేన మండల అధ్యక్షుడు జయరాం, టౌన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, నాయకులు సంజీవరాయుడు, వెంకటేష్, శివ, మహేశ్ పాల్గొన్నారు.

సానేవారిపల్లి చెరువులో చేపలు మృతి

ముదిగుబ్బ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సానేవారిపల్లి చెరువులో బుధవారం చేపలు మరణించాయి. విషప్రయోగం జరిగి ఉండొచ్చని ఆ గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన చేపలను పరీక్షలకు పంపేలా పోలీసులు, మత్స్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు. వారంలో ఈ చెరువు వేలం వేయాల్సి ఉండగా ఇలా జరగడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.



చెరువులో మరణించిన చేపలు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

కొత్తచెరువు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరగంపల్లి, మామిళ్లకుంటక్రాస్, కొత్తచెరువు గ్రామాలకు శ్మశాన వాటికకు స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. ముందుగా ఇరంగపల్లి, నాగిరెడ్డిపల్లి మీదుగా సీపీఎం నాయకులు గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. డీటీ బాలాంజినేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

బత్తలపల్లి ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్టూరు గ్రామంలో నిర్మించిన రామాలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల గ్రామాల వాసులు వందలాది మంది పాల్గొన్నారు. అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మినారాయణ, జనసేనా రాష్ట్ర నాయకుడు చిలకం మధుసూదనరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కరణం సూర్యప్రకాష్ రావు, హేమంత్, నరసింహరెడ్డి, జగ్గు, వీరనారప్ప, సాంబ , బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎంపీ అంబికా, చిలకం మధుసూదనరెడ్డి, హరీష్

విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి



సంతోష్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కదిరి, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మురళి, రమణమ్మ కుమారుడు బి.సంతోష్ ఇంటర్ ఫలితాల్లో 989 మార్కులు సాధించారు. ఆ విద్యార్థిని బుధవారం కదిరి పింఛనర్లు అసోషియేషన్ సభ్యులు సన్మానించి.. రూ.15వేలు ప్రోత్సాహక బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఆ అసోషియేషన్ నాయకులు శివారెడ్డి, ఆత్మారెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో విస్తృత తనిఖీలు

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ, కేతిరెడ్డికాలనీల్లో టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం విస్తృతంగా తనిఖీ చేపట్టారు. అనుమానితులు, రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్ ఇళ్లను క్షున్నంగా తనిఖీలు చేశారు.



కేతిరెడ్డి కాలనీలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎంపీడీఓ ఎక్కడ?

కొత్తచెరువు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మండల ఎంపీడీఓగా శివరాంప్రసాద్‌రెడ్డిని జడ్పీసీఈఓ ఈనెల 9వ తేదీన నియమించారు. అయితే ఆయన కొత్తచెరువు కార్యాలయాన్ని సందర్శించి.. విధులకు హాజరవుతానని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్‌కు చెప్పి వెళ్లారు. అంతే ఇప్పటివరకు ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఈయన గతంలో గుమ్మగట్టు ఎంపీడీఓగా ఉంటూ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో అప్పటి కలెక్టర్ సిరి ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఆయన విధుల్లో లేరు. ఇటీవల ఒక రాజకీయ నాయకుడి పలుకుబడితో పోస్టింగ్ తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై జడ్పీ డిప్యూటీ సీఈఓ సూర్యనారాయణను వివరణ కోరగా శివరాంప్రసాద్‌రెడ్డికి కొత్తచెరువు ఎంపీడీఓగా పోస్టింగ్ వచ్చిందని, ఇప్పటి వరకు ఆయన జాయిన్ అయినట్లు తమకు సమాచారం రాలేదన్నారు. తాను కూడా ఆయనకు ఫోన్ చేసినా సమాధానం రాలేదన్నారు. ఈ విషయాన్ని సీఈఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చేనేత కార్మికుడి అదృశ్యం

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు షేక్ షెక్షావలి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నేసిన చీరలకు గిట్టుబాటు రాక తెలిసిన వాళ్ల వద్ద నుం చి అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక మానసికంగా ఇబ్బందులు పడేవాడు. ఈనెల 16 ఇంటి నుంచి వెళ్లిన అత ను తిరిగి రాలేదు. కుటుం సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లే కుండా పోయింది. దీంతో షెక్షావలి భార్య షేక్ షాంషాద్ పోలీసుల కు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.



షెక్షావలి

మద్యాన్ని ధ్వంసం చేసిన పోలీసులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 నుంచి 2025 వరకు స్వాధీనం చేసుకున్న సారాయి, మద్యాన్ని డీపీఈఓ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో వీఆర్వో రేవతి సమక్షంలో పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. 260 లీటర్ల నాటుసారాను, కర్ణాటక మందు 11 కేసులు, ఆంధ్ర మద్యం 38 కేసులను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శివరాముడు, ఏఎస్ఐ బాబునాయక్, నాగభూషణం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నేటి నుంచి అవగాహన కార్యక్రమం

కొత్తచెరువు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్‌తో అధిక మార్కులు సాధించిన 64 మంది విద్యార్థినులను బుధవారం ఘనంగా సన్మానించారు. వీరితో 14 మందికి ఒక్కొక్కరికి రూ.750 చొప్పున రూ.10,500 నగదును, మిగిలిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, విశ్రాంత ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మీ పాల్గొన్నారు. ధర్మవరానికి చెందిన చేనేత ప్రముఖుడు బీవీఆర్ శ్రీనివాసులు ఈ బహుమతులను అందజేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ అందరి బాధ్యత

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్డీఓ మహేశ్ సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ టీం అధికారులతో బుధవారం సమావే శం నిర్వహించారు. ప్ర భుత్వ భూములను పరిరక్షణకు పలు శాఖల నుంచి సూచనలు, సలహాలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ అధికారి, పోలీసుఅధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రైవేటు ప్రభంజనం

ధర్మవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. ఆ విద్యార్థులను ఆయా పాఠశాలలో కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

● కాకతీయ పాఠశాల : విష్ణు(595), లిఖిత(590), హాసిని (584) మార్కులు సాధించారు. .వందశాతం ఉత్తీర్ణత శాతం సాధించామని, 500 పైగా మార్కులు 44 మంది విద్యార్థులు సాధించారని పాఠశాల ఫౌండర్ రామిరెడ్డి, కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి తెలిపారు.

● రూపారాజీ పీసీఎంఆర్ పాఠశాల: ఈ పాఠశాలలో 540 పైన మార్కులను 51 మంది, 500పైన మార్కులను 92 మంది విద్యార్థులు సాధించారు. రిత్విక్‌రాయల్ (595), గంగాభవాని(589), చరణ్యరెడ్డి(585), లిఖిత్(585), రఫీషా(584), వైష్ణవి(583), హరిణి(582), భరత్‌కుమార్(582), మేఘన(582), మహతి(580) మార్కులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు.

● యశోద పాఠశాల: జితేంద్ర(592), తనుశ్రీచౌదరి(591), వైష్ణవి(590), సూర్యతేజ(589), జాన్హవి (588), యోగా దీపిక(588), హృదయ్ కీర్తన(587), హర్షిత(587), షఫియాపాతీమా(586) కోమల క్రిష్ణ(586) మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీ తెలిపారు.

● ఆదిత్య పాఠశాల : 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. శ్రీనివాస్ (585), సంతోష్‌రెడ్డి (567), యతీశ్ (562) మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పూజారి జనార్దన్ తెలిపారు.

● కదిరిఅర్బన్ : పట్టణంలోని వాల్మీకి పాఠశాల విద్యార్థులు సి. పూజిత 597, బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు కుమార్‌రెడ్డి 589, పూర్ణిమ 587, కౌసల్‌రెడ్డి 586, ఫారూక్ 585, యాసిన్ 585, బాలాజీ 584, దివ్య 583, యాస్మిన్ భాను 583, రెడ్డి నరసింహ 583 మార్కులు సాధించారు. దత్త పాఠశాల విద్యార్థులు జస్మిత 577, ఆసిప్ 577, హర్షియా 562, జరూన్‌నాయక్ 560, హనిఫీ 560 మార్కులు సాధించారు. సాధిన పాఠశాల విద్యార్థులు మేఘనా 592, నిహారిక 590, బాలాజీ 581, లిఖిత 580, సీమా 579, చరణ్ 577, లహరి 577, ప్రణిత 576 మార్కులు సాధించారు. హరీష్ పాఠశాల విద్యార్థులు చరణ్ 584, శరణ్య 583, శ్రీజారెడ్డి 582, చరణ్ 579, సుహితరెడ్డి 570 మార్కులు సాధించారు.

● గాండ్లపెంట:ప్రైవేటు స్కూల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు తేజశ్రీ 588, మిజబా 585, కీర్తన 571, శాంతినికేతన్ విద్యార్థులు శ్వేత 518, యశ్వంత్‌రెడ్డి 504, జస్మిత 482 మార్కులు సాధించారు.



తేజశ్రీ

● ముదిగుబ్బ : స్థానిక పీవీఎస్ స్కూల్ విద్యార్థి గుత్తా రమ్యశ్రీ 589 మార్కులు సాధించింది. ఈమె మండలంలోని సానేవారిపల్లికి చెందిన రైతు గుత్తా దామోదర్ నాయుడు, లావణ్య కుమార్తె.



గుత్తా రమ్యశ్రీ

● ఓబుళదేవరచెరువు: వశిష్ట ఇంగ్లీషు మీడియ పాఠశాల విద్యార్థులు బి. గౌతమ్‌రెడ్డి 597, నవదీప్‌నాయుడు 591, వర్షిణీ 586, రైయింబో పాఠశాల విద్యార్థులు లయశ్రీ 596, వైష్ణవి 587, తేజశ్వనీ 585, శ్రీవిజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు చరణ్‌కుమార్‌నాయక్ 595 మార్కులు సాధించారు.



గౌతమ్‌రెడ్డి లయశ్రీ చరణ్‌కుమార్



కాకతీయ పాఠశాల విద్యార్థులు విష్ణు, లిఖిత, హసిని, షానా, కుసుమ రూపారాజీ పీసీఎంఆర్ విద్యార్థులు సంద్రరుత్వీక్ రాయల్, గంగాభవాని రాజ్. చరణ్యరెడ్డి, లిఖిత్, రఫీషా , వైష్ణవి, హరిణి, భరత్‌కుమార్



రూపారాజా విద్యార్థులు మేఘన, మహతి, యశోద పాఠశాల విద్యార్థులు జితేంద్ర, తనుశ్రీచౌదరి, వైష్ణవి, సూర్యతేజ, జాన్హవి, యోగదీపిక, హృదయ్ కీర్తన, హర్షిత, షపియా ఫాతీమా, ఆదిత్య పాఠశాల విద్యార్థులు సంతోశ్‌రెడ్డి, యతీశ్

న్యూస్ బాక్స్

జాతీయ పోటీలకు ఏపీ జట్టు


జట్టుతో నాయకులు, అధికారులు

హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో శుక్రవారం నుంచి 29వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి అండర్-14 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు బుధవారం తరలి వెళ్లింది. గత యేడాది అక్టోబర్‌లో హిందూపురం ఎంజీఎం క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన జట్టును రాష్ట్రం తరుపున ఎంపిక చేశారు. వారంతా బుధవారం కొల్హాపూర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ రమేష్, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోరార్జియాదవ్, జిల్లాఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహ్మద్‌సలీం, పీడీ లోక్‌నాథ్, పుట్టపర్తి సీఐ సురేష్ జట్టును అభినందించారు.

బాలకృష్ణను ఘనంగా సన్మానిద్దాం

పురం టీడీపీ నాయకులు


క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు వచ్చేనెల 4న ఎంజీఎం క్రీడా మైదానంలో పౌరసన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం టీడీపీ నాయకులు ఎంజీఎం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈనెల 28న పద్మభూషన్ అవార్డు బాలకృష్ణ అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు హిందూపురం నియోజకవర్గం తరుపున వచ్చేనెల 4న ఎంజీఎం క్రీడా మైదానంలో 20వేల మందితో పౌరసన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. వచ్చే జనం కోసం వాహనాల పార్కింగ్, మైదానంలో బారికేడ్లు, సభాస్థలి, ఏర్పాట్లను ఎక్కడెక్కడ చేయాలో అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, టీడీపీ నాయకుల నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, టీడీపీ నాయకులు నాగరాజు, అనీల్, పరిమళ, సతీష్, మాజీ సర్పంచ్ రాము, తదితరులుపాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


నివాళులు అర్పిస్తున్న నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ గంగంపల్లికి చెందిన టీడీపీ నాయకుడు టైలర్ రుద్రప్ప కుటుంబాన్ని మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల కిష్టప్ప బుధవారం పరామర్శించారు. టైలర్ రుద్రప్ప కుమార్తె పూల భార్గవి (24) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ మాజీ మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం, పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన గీత

పావగడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇన్‌చార్జి అధ్యక్షురాలిగా గీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న అధ్యక్షులు రాజేష్ ఒప్పందం ప్రకారం రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీగా ఉంది. మే3 వ తేదీ వరకు ఇన్‌చార్జిగా గీత కొనసాగాలని ఆదేశించడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. మే 3న అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కగ్గల్లులో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ గంగప్ప మాట్లాడుతు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మీ, హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు మీన కుమారి, మారుతి పాల్గొన్నారు.


గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల హవా

పదో తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్కుల పంట పండించారు. లేపాక్షి మండలం శిరివరం ప్రభుత్వ విద్యార్థిని రక్షిత 591 మార్కులు సాధించింది. అంబేడ్కర్ గురుకుల పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. పట్టణంలోని సీపీఐ కాలనీవద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 82మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 82మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 28మంది 500కుపైబడి మార్కులు సాధించారు.


రక్షిత

లేపాక్షి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 715 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 546మంది ఉత్తీర్ణులయ్యారు. శిరివరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రక్షిత 591మార్కులు సాధించింది.


జాహ్నవి మౌనశ్రీ ఉషశ్రీ

పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో 66శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, మావటూరు, రాంపురం, బాలికల పాఠశాలలో 409మందికిగాను 268మంది పాసయ్యారు. గుట్టూరు జడ్పీహెచ్‌ఎస్‌లో జాహ్నవి 569 /600, మౌన శ్రీ 569/600, ఉషశ్రీ 567/600 మార్కులు సాధించారు.

రొద్దంలో...

రొద్దంలో 68శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 428మంది విద్యార్థులకుగాను 291 మంది విద్యార్థులు పాసయ్యారు.


చందన విశ్వంత్ నేహారెడ్డి

అగళి,(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా 334 మంది పరీక్షలు రాయగా 236మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మధుడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చందన 586 మార్కులు సాధించింది. నేహారెడ్డి 581, మధుడి బీసీ హాస్టల్ విద్యార్థి విశ్వాంత్ 569, ఇనగలూరులో అమృత్ 569 మార్కులు సాధించాడు.


చంద్రలేఖ భాను అమృత

గుడిబండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుడిబండ ఎంజేపీ పాఠశాల విద్యార్థులు చంద్రలేఖ 582, భానుప్రియ 579, స్పందన 557, అమృత 577, హాసిని 576, అమ్మాజి 574, దీక్షిత 573, శరణ్యశ్రీ 572, జ్యోత్స్నప్రియ 569 మార్కులు సాధించారు. రజిని 568, సింధూజ 567, విష్ణుప్రియ 565, రాగిణి 565, మోరుబాగల్ సందీప్ 561, ఎస్.రాయాపురం గగన్ 560 మార్కులు సాధించారు.


స్పందన హాసిని


అక్షిత కీర్తన భరత్‌కుమార్

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కస్తూర్బా బాలికల పాఠశాలలో అక్షిత 586 మార్కులు సాధించింది. శ్రీసాయి విద్యానికేతన్‌లో చదువుతున్న కీర్తన 584మార్కులు సాధించగా బసనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి భరత్‌కుమార్ 579మార్కులు తెచ్చుకున్నాడు


ముస్కాన్ ఆఫియా ప్రవల్లిక సంజన రేణుకాశ్రీ భవ్యశ్రీ భవ్యశ్రీ


భార్గవి అల్మాస్‌బేగం తనూశ్రీ ప్రణిత స్ఫూర్తి శ్లోక

పెనుకొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో ఈ యేడాది ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో 409మంది పరీక్షలు రాయగా 268మంది ఉత్తీర్ణత సాధించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉర్దూపాఠశాలలో 79శాతం ఉత్తీర్ణత సాధించారు. ముస్కాన్ 523మార్కులు సాధించింది. ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి జశ్వంత్‌యాదవ్ 497మార్కులు, జిల్లాపరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థి టీకే అఖిల్ 536మార్కులు సాధించారు. బాలికల ఉన్నత పాఠశాలలో బీబీ అమీన 585మార్కులు, ఆసియా 539, ప్రవల్లిక 538మార్కులు సాధించారు. ఎస్‌వి గురుకుల పాఠశాలలో నాగమణిబాయి 538 సాధించింది. స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాల విద్యార్థులు తనుశ్రీ 593, ప్రణతి 591, స్ఫూర్తి 593, శ్లోక 587 మార్కులు సాధించారు. శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రేణుశ్రీ 585, సంజన 584, భవ్యశ్రీ 583 మార్కులు సాధించారు. బ్రిలియన్స్ పాఠశాల విద్యార్థులు భవ్యశ్రీ 575, భార్గవి 570, అస్లిస్‌బేగం 569 మార్కులు సాధించారు.

వందశాతం ఉత్తీర్ణత

హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అంబేడ్కర్ గురుకుల పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. పట్టణంలోని సీపీఐ కాలనీవద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 82మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 82మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 28మంది 500కుపైబడి మార్కులు తెచ్చారు. ఇందులో చదువుతున్న ధర్మవరం ప్రాంతమైన ఉప్పలపాడుకు చెందిన పూజిత 587మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. అదే పాఠశాలలో కీర్తన, పవిత్రలు 581, రేవతి 570మార్కులు సాధించారు. హిందూపురం పట్టణం, మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 45ఉన్నాయి. ఇందులో 2748మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2048మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల చూస్తే తూముకుంటలో అత్యల్పంగా 21మందికిగాను నలుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పూలకుంట 75శాతం, అత్యల్పంగా కొటిపి 15శాతం, మలుగూరు 77శాతం, రాచపల్లి 51శాతం, సంతేబిదునూరు 45శాతం, చౌళూరు 25శాతం, బెంగళూరు రోడ్డులో ఉన్న ఉన్నతపాఠశాల 58శాతం, నేతాజీ పాఠశాల 33శాతం, ముద్దిరెడ్డిపల్లిలోని బాలికల పాఠశాల 92శాతం కొట్నూరు 54శాతం సాధించాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 60శాతం, ఏపీఎంఎస్ ఉన్నత పాఠశాల 75శాతం, అజీజియా ఉర్దూ పాఠశాల 62, ఎంజీఎం 49.69, కేజీబీవీ 97శాతం, మలుగూరు, అంబేడ్కర్ గురుకులం 88శాతం, బసవనపల్లి 29శాతం, ముద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల 58శాతం ఉత్తీర్ణత సాధించాయి.


పూజిత


తేజస్విని నయన రమ్యశ్రీ

మడకశిర టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల 91 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా మడకశిర మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 33శాతంతో చివరి స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ భాస్కర్ వెల్లడించారు. మండలంలోని మొదటి స్థానంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని టి.ఆర్.తేజశ్విని 579 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలించింది. ఎంజెపీ గురుకుల పాఠశాల నందసాయి 579 సాధించి ఇద్దరు మొదటి స్థానంలో నిలవగా ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్.కీర్తన 560 రెండవ స్థానంలో నిలించిది. కేజీ బివి పాఠశాల విద్యార్థిని నయన 553 మార్కులు సాధించి నాలుగవ స్థానంలో నిలించిది. మణూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస 550 మార్కులు సాధించింది.


గగనేశ్వరి విష్ణువర్ధన్ హేమంత్‌కుమార్
చందన పల్లవి భవ్యశ్రీ

గోరంట్ల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 9 ఉన్నత, కేజీబివి, గిరిజన బాలికల పాఠశాలలోని 644మంది పరీక్షలు రాయగా, 421మంది ఉత్తీర్ణత సాధించి 65.37 శాతంఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ తెలిపారు. గుమ్మయ్యగారిపల్లి వ్యవసాయ కుటుంబానికి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి, వరలక్ష్మీ కుమార్తె గగనేశ్వరీ 590మార్కులు సాధించింది. గోరంట్లకు చెందిన కార్పెంటర్ ఈశ్వచారి, దేవిక కుమార్తె చందన, చేనేత కార్మికుడు వెంకటరెడ్డి, సుగుణమ్మ కుమార్తె పల్లవిలకు 585 వచ్చాయి. భవ్యశ్రీ 583, బాలికొన్నత పాఠశాలను ఎంఇఓ జాన్‌రెడ్డెప్ప దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేశారు. బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు విష్ణువర్ధన్, హేమంత్‌కుమార్‌లకు 589మార్కులు వచ్చినట్లు హెచ్‌ఎం గోపాల్ తెలిపారు. నారాయణ పాఠశాలలో అన్విత 595, వర్ష 594, శ్రీలక్ష్మీ 592 మార్కులు రాగా, శ్రీవివేకానందలో జశ్వంత్‌సింహారెడ్డి 594, రోహిత్, సాయివాత్సల్యయ్యలకు 593 మార్కులు వచ్చాయి.


అన్విత జశ్వంత్‌సింహారెడ్డి

మడకశిర రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల ఎంజేపీ పాఠశాలలోని విద్యార్థి నందసాయి 600 మార్కులకు గాను 579 మార్కులు. మడకశిర బాలికల ఉన్నత పాఠశాలలో తేజస్వినీ 600గాను 579 మార్కులు సాధించారు. విద్యార్థులను ఉపాధ్యాయలు ,తల్లిదండ్రులు అభినందించి ఆనందం వ్యక్తంచేశారు. మండలలోని ప్రభుత్వ పాఠశాల మొత్తం విద్యార్థులు 929 మందికి గాను 596 మంది ఉత్తీర్ణత సాధించారు దీంతో మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 64.16 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు.


నందసాయి తేజశ్విని


హేమామృత

సోమందేపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 506మంది పరీక్షలు రాయగా 382మంది పాసయ్యారు. విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన హేమామృత 595మార్కులు సాధించింది. క్రీస్తు జ్యోతి విద్యార్థి రోహిత్‌గౌడ్ 589 మార్కులు, షర్మిల 580మార్కులు సాధించారు.


రక్షిత స్పందన హర్షిత


చంద్రశేఖర్

చిలమత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో 59.69 శాతం ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ఎస్ఎస్‌వైవిఎన్ ప్రైవేటు పాఠశాల విద్యార్థి రక్షిత 589 సాధించింది. టేకులోడు గురుకుల పాఠశాల విద్యార్థిని స్పందన 587, కోడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని షేక్ లియజ్ 585, దేమకేతేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని తనుశ్రీ 577, చిలమత్తూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని భారతి 527, సోమఘట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రోహిణి 559 మార్కులతో ఉత్తమ ప్రతిభ చూపారు.


హిందూసంఘాల ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ


గోరంట్లలో...

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ర్యాలీలో ఐక్యవేదిక నాయకులు

పహల్గాం ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

హిందూపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి దారుణమైందని హిందూసంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. బుధవారం కాగడాల ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. అదేవిధంగా బెంగాల్‌లో హిందువులే లక్ష్యంగా దాడి చేయడం శోచనీయమన్నారు. చిన్న మార్కెట్‌నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ చేపట్టారు.

వైసీపీ ఆధ్వర్యంలో..

ఉగ్రదాడిని నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పురం వైసీపీ ఇన్‌చార్జి దీపిక, మడకశిర వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్ప మాట్లాడుతూ పర్యాటక ప్రాంతానికి వెళ్లిన అమాయక ప్రజలపై ఉగ్రదాడి చేయడం అతిదారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ ఇంతటి దురాగతానికి పాల్పడిన ఉగ్రవాదులను తక్షణమే శిక్షించాలని విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం రాత్రి విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని ఖండిస్తూ నినాదాలు చేస్తూ కొవ్వొత్తులు చేతబట్టి ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

పావగడ(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గాంలో హిందువులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడం హేయమైన చర్య అని శ్రీరామసేన జిల్లా అధ్యక్షుడు అనిల్‌యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ఖండించారు. దాడికి పాల్పడిన ముష్కరులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీజెపి నాయకులు జమ్ముకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌ల జరిగిన ఉగ్రదాడినికి నిరసనగా కొవోత్వత్తుల ర్యాలీ బుదవారం నిర్వహించారు. కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఆత్మశాంతిచేకూరాలని నివళ్లు అర్పించారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కోవ్వోత్తులు వెలిగించారు. ఈకార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, శీనా, ఈశ్వర్‌రెడ్డి, చలం, శంకర్, అశోక్, నరేష్, రామాంజనమ్మ, కళ్యాణ్ తదితరులున్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైసీపీ శ్రేణులు

సమాచారం కోసం హెల్ప్‌లైన్

పావగడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో కశ్మీర్‌కు వెళ్లిన కర్ణాటక రాష్ట్రానికి చెందినవారి వివరాలను 08043344334, 35, 36కు ఫోన్‌చేసి అందించవచ్చునని పర్యాటక శాఖ ఒక ప్రకటనలో కోరింది. పహల్గాం ఉగ్రదాడిలో శివమొగ్గకు చెందిన మంజునాథ్ మృతిని ఖండిస్తున్నట్లు పేర్కొంది.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

గుడిబండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుడిబండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం 8గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు. శంకర కంటి ఆసుపత్రి, బెంగళూరువారి సౌజన్యంతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'మద్యం సేవించి వాహనాలు నడపరాదు'

చిలమత్తూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని హిందూపురం సీఐ జనార్ధన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ సూచించారు. బుధవారం కొడికొండ చెక్‌పోస్టులో వారు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేశారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అజాగ్రత్తగా ఉండరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతి వేగం, ఓవర్ టేక్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం చేయరాదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడపటం నేరమన్నారు. అదేవిధంగా వాహనం నడిపే సమయంలో లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎవరైనా రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పలువురు వాహన డ్రైవర్లకు మద్యం పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు.


డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ మునీర్ అహమ్మద్